క్లుప్తంగా

ముమ్మరంగా పోలీసుల తనిఖీ

చర్ల: చర్లలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఆదివారం ఇక్కడ జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్ దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు సంతలో సరుకులు కొనుగోలు చేసేందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివాసీల మాటున మావోయిస్టులు, సానుభూతిపరులు, మిలీషియా సభ్యులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన ఉంజుపల్లి రోడ్, తాలిపేరు ప్రాజెక్టు రోడ్, కలివేరు క్రాస్‌రోడ్ కుర్నపల్లి రోడ్‌లలో మోహరించిన పోలీసు బలగాలు.. వచ్చిపోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించి నిర్ధారించుకున్న తరువాత విడిచిపెట్టారు. సీఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌లు తనిఖీలు కొనసాగగా, సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

మహా అన్నదానం



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మణుగూరురూరల్: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మణుగూరు బులియన్ మర్చంట్స్ అసోసియేషన్, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పైలట్‌కాలనీ గోల్డ్‌షాప్ లైన్‌లో ఆదివారం భారీ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానంలో భక్తులు వందలాది మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు లంక సత్యనారాయణ, వెచ్చా చంద్ర శేఖర్, కందుకూరి సుబ్రహ్మణ్యం, ఏంఏ నాయుడు, సంకా శ్రీనివాసరావు, శంకర్, నరేందర్, ఎస్.శ్రీనివాస్, నరేష్, కె.రవికుమార్ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ నేతల నిరసన



పిచ్చిమొక్కల నడుమ షటిల్ ఆడుతున్న మిత్రపక్షాల నాయకులు

బూర్గంపాడు: ఏడాది క్రితం భూమి పూజలు చేసిన ఇండోర్ షటిల్ కోర్టు.. పిచ్చి మొక్కలతో బురదమయంగా మారడంతో ఆ ప్రదేశంలో షటిల్ ఆడుతూ ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాలు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపు కోసం కార్మికులను మభ్య పెడుతూ ఆనాడు ఇండోర్ షటిల్ కోర్టు శంకుస్థాపన చేశారని, వారి చిత్తశుద్ధికి బురద, పిచ్చిమొక్కలే నిదర్శనమని అన్నారు. దీనికి వత్తాసు పలుకుతూ.. మార్వాడి ముసుగులో ఉన్న కార్పొరేట్ యాజమాన్యం.. ఇకనైనా పనులు ప్రారంభించాలని కోరారు. డ్రెయినేజీ, శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను కార్మికులకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెక్యూరిటీ గార్డుల వితరణ

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా మురళీ మ్యాన్ పవర్ సెక్యూరిటీ విభాగంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న డి.ప్రేమ్‌కుమార్, డి.శ్రీనివాస్‌ల తండ్రి రాజమౌళి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆదివారం సెక్యూరిటి గార్డులను తోటి సెక్యూరిటీ గార్డులు పరామర్శించి రూ.32,600లను ఆర్థిక సహాయంగా అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మురళీమ్యాన్ పవర్ ఏజెన్సీ సూపర్‌వైజర్లు రామవతార్, రబ్బాని, ఎంఎంఏ సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు అడబాల ప్రవీణ్‌కుమార్, ఎస్.సుధాకర్, పి.రవికుమార్, పాదిల వీరబాబు, జి.రాజశేఖర్ పాల్గొన్నారు.

గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలి

చర్ల: గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో పని చేస్తున్న డైలీవేజ్ వర్కర్లకు కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ డిమాండ్ చేశారు. చర్లలోని లక్ష్మీ కాలనీలో ఉన్న కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం ఎదుట మండలంలోని గిరిజన వసతి గృహాల్లో పని చేస్తున్న డైలీవేజ్ వర్కర్లు సమ్మె చేపట్టగా.. ఆ శిబిరాన్ని సతీష్ సందర్శించి సంఘీభావం తెలిపారు. మాట్లాడుతూ.. జీఓ నెంబర్ 527ను రద్దు చేసి జీఓ నెంబర్ 60 ప్రకారం వర్కర్లకు నెలకు రూ 16 వేల వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు డైలీవజ్ వర్కర్లు పాల్గొన్నారు.

రోగుల్లా వస్తారు.. దోచేస్తారు..

- భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో రెచ్చిపోతున్న దొంగలు
- ఇటీవల మూడు సెల్‌ఫోన్లు చోరీ..
- పూర్తి స్థాయిలో పనిచేయని సీసీలు
- సరిపడా లేని సెక్యూరిటీ సిబ్బంది



ఆస్పత్రిలో సీసీ కెమెరా ఉండాల్సిన ప్రదేశంలో ఖాళీగా ఉన్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల ఎక్కడో ఒక చోట చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ఇటీవల ఇదే క్రమంలో ఆస్పత్రిలో మూడు సెల్‌ఫోన్లు చోరికి గురికాగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం రెండు రోజుల తరువాత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి కుటంబీకులు అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని పట్టుకున్నారు. ఆస్పత్రి అధికారులకు తెలియజేసి.. అనంతరం సదరు వ్యక్తిని పోలీసులకు అప్పగించారు.

భద్రాచలం ఏరియా ఆస్పత్రి 200 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయ్యి ఏళ్లు గడుస్తున్నాయి. ఈ క్రమంలోనే ఆస్పత్రిలో ఓపీ సంఖ్య పెరుగుతూ వస్తోంది. దీంతో ఆస్పత్రిలో చోరీలు మొదలయ్యాయి. గతంలో కూడా ఇలాగే చోరీలు జరిగిన సంఘటనలు ఉన్నప్పటికీ.. ప్రస్తుతం అన్ని వార్డుల్లో రద్దీ ఎక్కువగా ఉండడంతో పిక్‌ప్యాకెటర్లు మరింత చెలరేగిపోతున్నారు. రోగులు, వారి సహాయకుల ముసుగులో వచ్చి ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నారు.

సెక్యూరిటీ గార్డుల కొరత

ఏరియా ఆస్పత్రిలో మొత్తం 19 మంది సిబ్బందిని సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. వీరిలో పూర్తి స్థాయిలో 12 మంది మాత్రమే విధుల్లో ఉంటుండగా.. మిగిలిన ఏడుగురిలో కొందరు సెలవులు పెడుతుండటం, మరి కొంతమంది వివిధ విభాగాల్లో సహాయకులుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో మొత్తంగా 25 మంది సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తేనే ఇటువంటి చోరీలు నియంత్రించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఉన్నది 14 కెమెరాలే..

ఆస్పత్రిలో ప్రస్తుతం 14 కెమెరాలు మాత్రమే ఏర్పాటు చేయగా.. వీటిలో కొన్ని మరమ్మతులకు గురయ్యాయి. ఇటీవల ఏరియా ఆస్పత్రిలో అనుమానస్పదంగా ఉన్న ఓ వ్యక్తి పట్టుపడడంతో.. అధికారులు కొత్తగా మరో 16 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పరిస్థితి కొంతమేరకు మారుతుందని అధికారులు, రోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిఘా వ్యవస్థలో మార్పులు..



ఇటీవల ఆస్పత్రిలో చోటు చేసుకున్న ఘటన ఆధారంగా సీసీ కెమెరాల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకున్నాం. సెక్యూరిటీ గార్డుల సంఖ్యనూ పెంచేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాం. రోగుల భద్రతే మాకు ముఖ్యం. వార్డులో ఎవరైనా అనుమనస్పదంగా ఉంటే వెంటనే ఆస్పత్రిలో ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి లేదా ఆస్పత్రి సిబ్బందికి సమాచారం ఇవ్వాలి.

– డాక్టర్ రామకృష్ణ, ఆస్పత్రి సూపరింటెండెంట్

బాల్యవివాహాల నిర్మూలనకు పాటుపడాలి



అవగాహన కల్పిస్తున్న జ్యోతి

మణుగూరురూరల్: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలని ఎయిడ్ సంస్థ మండల సోషల్ మొబలైజర్ నాగుల జ్యోతి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కూనవరం గ్రామపంచాయతీలోని మసీద్‌లో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రర్ వారి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మసీద్ ప్రాంతంలో ఆమె బాల్య వివాహాల నిర్మూలన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా బాల్యవివాహాల నిర్మూలనపై దేవాలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతిజ్ఞలు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ మండల సోషల్ మొబలైజర్ మౌనిక, ముస్లిం పెద్దలు మౌలానా అష్రఫ్, ఎండి.ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ప్రైవేటీకరణపై ఉద్యమిద్దాం

చర్ల: ఐసీడీఎస్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలకు అంగన్‌వాడీ టీచర్లు హెల్పర్లు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కొలగాని బ్రహ్మచారి పిలుపునిచ్చారు. చర్లలో జరిగిన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మచారి మాట్లాడారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. మహాసభలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకుంది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఈ సం వెంకటమ్మ, జి.పద్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ మహాసభలో చర్ల ప్రాజెక్టు నుంచి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.విజయశీలను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. వీరితో పాటు జిల్లా కమిటీలో చర్ల ప్రాజెక్టు నుంచి పాయం రాధా కుమారి, జయసుధ, యాలం నాగమణిలకు అవకాశం కల్పించారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా రాజ్యలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సారమ్మ, కోశాధికారిగా కళావతిలను ఎన్నుకున్నారు.

భీమునిగుండానికి గండి, పూడ్చివేత



భీమునిగుండం కట్టకు గండి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఈ రమేష్, రైతులు

అశ్వాపురం: మండల పరిధిలోని కాకతీయుల కాలం నాటి తుమ్మలచెరువు కట్టకు ఆనుకొని ఉన్న భీమునిగుండం కట్టకు ఆదివారం అకస్మాత్తుగా గండి పడింది. తుమ్మలచెరువు నీరు గుండంలోకి రావడంతో గుండం కట్ట క్రమక్రమంగా సుమారు 70 నుంచి మీటర్లు కట్ట కోతకు గురై గండి పడింది. రైతులు అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన నీటిపారుదల శాఖ డీఈ రమేష్, ఆయకట్టు రైతులు గుండం వద్దకు చేరుకుని రెండు జేసీబీలు, ట్రాక్టర్లు, బ్లేడ్ ట్రాక్టర్లతో గండిని తాత్కాలికం పూడ్చివేశారు. అధికారులు స్పందించి కట్టకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

సమ్మెకు సంఘీభావం..



ఖాళీ ప్లేట్లతో సమ్మె చేస్తున్న కార్మికులు.. మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

దమ్మపేట: మండలంలోని అంకంపాలెం, దుర్గం గొల్లగూడెం, చీపురుగూడెం, పార్కలగండి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న దినసరి వేతన కార్మికులు నిరవధికంగా మూడో రోజు చేస్తున్న సమ్మెకు, సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ఆదివారం ఖాళీ ప్లేట్లతో సమ్మెలో పాల్గొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కొప్పుల శ్రీను, రఘు మాట్లాడుతూ.. కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించి, జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం పాత పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మెపై స్పందించకుండా నిర్లక్ష్యంతో ఉన్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా.. సోమవారం భద్రాచలం, ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు రామలక్ష్మి, బుచ్చయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



దమ్మపేట: హిందీ భాషా దినోత్సవంలో ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం చంద్రకళ..

దమ్మపేట: మండలంలోని దుర్గం గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో జాతీయ హిందీ బాషా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు రమేష్, సువర్ణకుమార్‌లను శాలువాతో మర్యాదపూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చంద్రకళ మాట్లాడుతూ...భారత జాతీయ ఉద్యమ సమయంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు, హిందీ భాష అనాడు దోహదం చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్ల: చర్లలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో ఆదివారం హిందీ దివాస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్ వర్మరాజు మాట్లాడారు. దేశంలో ఎక్కువశాతం జనాభా మాట్లాడే బాష హిందీ అని ఆయన అన్నారు. హిందీ నేర్చుకోవడం, మాట్లాడడం, రాయడం ఎంతో సులువు అని, ప్రతీ ఒక్కరూ మిందీ బాషను నేర్చుకునేందుకు ఆసక్తిని చూపాలని ఆయన పిలుపునిచ్చారు. విదాయలయం అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 16వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రహీముల్లా బేగం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 10 గంటలకు భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లో జరిగే బహిరంగ వేలంలో పాల్గొన్నాలని పేర్కొన్నారు.

‘దిమ్మె ధ్వంసానికి కుట్ర’

చంద్రుగొండ: తురక కాశ సంఘం జెండా దిమ్మెను ధ్వంసం చేసేందుకు కొంతమంది కుట్ర చేస్తున్నారని సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ బాద్‌షా ఆరోపించారు. మండంలోని మహ్మద్‌నగర్ గ్రామంలోని దిమ్మె వద్ద సంఘం సభ్యులతో ఆదివారం ఆయన నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు, పోలీసులు దిమ్మెను తొలగించాలని బెదిరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే ఈ విషయమై పంచాయతీ సెక్రటరీ శివనారాయణను వివరణ కోరగా.. దిమ్మెను రోడ్డుపై నిర్మిస్తుండగా పక్కన నిర్మాణం చేసుకోవాలని చెప్పానని, ప్రజలకు ఇబ్బందికరంగా దిమ్మె నిర్మాణం చేశారని చెప్పారు.

వైద్య శిబిరం

అశ్వాపురం: లయన్స్‌క్లబ్ ఆఫ్ అశ్వాపురం స్టార్స్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గొంది గూడెం కొత్తూరు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అజయ్ ఆధ్వర్యంలో 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నల్లగట్ల సత్యప్రకాష్, ఉపాధ్యక్షుడు నంబూరి వెంకటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తుల పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం వద్ద ఉన్న చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి ఆలయానికి వచ్చి దర్శించుకున్నారు. అలాగే అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించండి

చంద్రుగొండ: దళితవాడల్లో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి పెద్దిని వేణు ప్రభుత్వాన్ని కోరారు. చంద్రుగొండలోని దళితవాడలో ఆదివారం పర్యటించిన ఆయన.. డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా నిర్మించడం ద్వారా మురుగు నీరు రోడ్లపైనే ఉంటున్నాయన్నారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. వాడల్లో అధికారులు పర్యటించిన సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ నాయకుడు రాయి రాజా పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ములకలపల్లి: పూసుగూడెం శివారులో చేపట్టిన వీరబ్రహ్మేంద స్వామి ఆలయ నిర్మాణానికి తాండ్ర నారాయణ రావు మెమోరియల్ ట్రస్ట్ (టీఎన్నార్) చైర్మన్, ఎన్నారై తాండ్ర వెంకటేశ్వరరావు రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈసందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్ట్ కమిటీ సభ్యులు నరాటి ప్రసాద్, తాండ్ర బుచ్చిబాబు, కొదుమూరి పుల్లారావు చేతుల మీదుగా ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకన్న అందజేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కాపర్తి వెంకటాచారి, కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కాసర్ల రామారావు, గ్రామస్తులు పేరసాని శ్రీనివాసరావు, సుబ్రమణ్యం, శ్రీనివాసా చారి, పరిపూర్ణా చారి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం కాదు.. అధ్వానం!



దట్టమైన పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న కొత్త కావడిగుండ్ల పల్లె ప్రకృతి వనం

అశ్వారావుపేటరూరల్: పచ్చని వృక్షాలు, పూలతో ఆహ్లాదాన్ని పంచాల్సిన ఓ పల్లె ప్రకృతి వనం నిర్వహణ లేక అధ్వానంగా మారింది. అశ్వారావుపేట మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్న కావడిగుండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్త కావడిగుండ్ల గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో లక్షల వ్యయంతో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. కాగా, గడిచిన ఏడాది కాలంగా ఈ పల్లె ప్రకృతి వనాన్ని నిర్లక్ష్యంగా వదిలేయడంతో అడవిలా చెట్లు పెరిగి లోపలి వెళ్లేందుకు దారి కూడా లేకుండా పోయింది. దీంతో ఉదయం, సాయంత్రం వేళలలో కొద్ది సేపు ప్రకృతి వనంలోకి వెళ్లి ఆహ్లాదాన్ని పొందాలని అనుకునే వారికి నిరాశే మిగులుతోంది. అలాగే గేటు రెక్క కుడా విరిగిపోగా, మూగజీవాలు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి మోతీలాల్‌ను ‘సాక్షి’ వివరణ కోరగా.. త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సాహిత్యాన్ని భావితరాలకు అందించాలి



కవులను సత్కరిస్తున్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య

బూర్గంపాడు: జాతి సంపదలైన తెలుగు భాషా, సాహిత్యాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య అన్నారు. ఆదివారం ఇరవెండి గ్రామంలో ఆయన నివాసంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో ‘భారతి విజయం’పేరిట కవి గాయక సమ్మేళనం, కవి మాల్యశ్రీకి ఆత్మీయ సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల్లో మానవీయ విలువలు సత్యం, ధర్మ, నీతి, న్యాయం నింపే సాహిత్యాన్ని కవులు రాయాలన్నారు. కవి మాలశ్రీ మన్య భారతం అనే మహా గ్రంథాన్ని రచించి జిల్లాకే వన్నె తెచ్చారన్నారు. ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో 15 మంది కవి గాయకులను ఘనంగా సత్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిక్కసారి శ్రీనివాస్, తిప్పన సిద్దులు, దేశప్ప ఎల్‌ఎంఎల్ సూర్యనారాయణ, రమణ, చింతూరి వెంకట్రావ్, లలిత, తాతోలు దుర్గాచారి, మూర్తి, జీవ, తిరుమలరావు, ప్రసాద్, రాజు, వాణి, దుర్గా ప్రసాద్, బాలాజీ రాజు, పూర్ణిమ, దుర్గా కోమలి, నాగలక్ష్మి కవులు పాల్గొని కవితా గానం చేశారు.

ఎట్టకేలకు మట్టి పోశారు..



కోతకు గురై, గొయ్యి పడిన ప్రదేశాన్ని మట్టితో నింపిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ములకలపల్లి: మాధారం వాగు సమీపంలో కోతకు గురవుతున్న బీటీ రోడ్డు వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు మట్టిపోశారు. ఆగస్టు 31న కురిసిన భారీ వర్షానికి పాల్వంచ-మండలపల్లి ప్రధాన రహదారి వాగు వద్ద భారీ గోయ్యి ఏర్పడింది. వరద ఉధృతికి రోజురోజూకూ కోతకుగురై, బీటీ రోడ్డుకు సైతం దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. రెండు వారాలు కావొస్తున్నా, అధికారులు దృష్టి సారించలేదు, దీంతో ‘ప్రమాదం జరిగే వరకూ పట్టించుకోరా..? శీర్షికన శుక్రవారం ‘సాక్షి’లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన సంబంధిత శాఖ అధికారులు గోయ్యి పడిన ప్రదేశంలో మట్టి పోసి, మరమ్మతులు చేశారు. అయితే కోతకు గురైన ప్రదేశంలో రివిట్‌మెంట్ చేసి, శాశ్వత పరిష్కారంగా రిపేర్లు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

భద్రాచలంటౌన్: భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా గుర్తింపు కార్డులను అందజేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంబీ నర్సారెడ్డి కోరారు. స్థానిక బండారు చంద్రరావు భవన్‌లో లంక శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన భద్రాద్రి మార్పులు వర్కర్స్ యూనియన్ మహాసభలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులని తుంగలో తొక్కుతూ కార్మిక చట్టాలు అన్నిటిని రద్దుచేసి కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈనెల 23, 24 తేదీలలో పట్టణంలో జరిగే 6వ భవన నిర్మాణ కార్మికుల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వై.వెంకట రామారావు, జాకీ, భాష, మధు, సురేష్, ప్రసాద్, చంటి, వెంకటేష్ ,కాజా, హుస్సేన్, రాయుడు, గిఫ్తార్ సింగ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలి



ఎమ్మెల్యే జారె ఆదినారాయణను సన్మానించిన ముస్లిం పెద్దలు

అశ్వారావుపేటరూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలని, నీతీనిజాయితీను పాటించాలని మౌలానా ముఫ్తి మహమ్మద్ సబీల్ సాహెబ్ ఖాస్మీ(తమిళనాడు), హజ్రత్ మౌలానా మహమ్మద్ సయిద్ అహ్మద్ సాహబ్ ఖాస్మి(ఖమ్మం) సూచించారు. ఆదివారం అశ్వారావుపేటలో పునఃనిర్మించిన జామిమా మసీద్ ప్రారంభోత్సవం, ఇస్లామిక్ ధార్మిక సభకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ముస్లింలు తప్పనిసరిగా ప్రవక్త చూపించిన బాటలో నడవాలని కోరారు. ముందుగా స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వేర్వేరుగా హాజరు కాగా, ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, రేమళ్ల కేధార్‌నాథ్, అల్లాడి రామారావు, బీఆర్ఎస్ నాయకులు యూఎస్ ప్రకాశ్‌రావు, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, సదర్ కమిటీ బాధ్యులు ఎస్‌కె.వలీపాషా, ఎండి.నజీర్, పెద్దలు ఎస్.అబ్దుల్ రెహమాన్ బాబా, జాకీర్, ఉస్మాన్, జలాల్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!



బీటీ రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

ములకలపల్లి: బీటీ రోడ్డు మధ్యలో ఏర్పడిన భారీ గుంత ప్రయాణీలకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. మాధారం నుంచి అన్నపురెడ్డిపల్లి వెళ్లే బీటీ రోడ్డు చాపరాలపల్లి గ్రామంలో భారీ గుంత ఏర్పడింది. వర్షాకాలం నేపథ్యంలో నీళ్లు నిలిచి ప్రమాదకరంగా మారింది. నిండిన గుంతలను ప్రయాణికులు గుర్తించకపోయినా.. ఏమాత్రం ఆదమరిచినా, ప్రమాదం చోటు చేసుకునే అవకాశాలున్నాయి. ఇబ్బందులు పడుతున్నామని, మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఏటీఎం ఎదుట వ్యాపారాలు



బ్యాంకు ఏటీఎం ఎదురుగా దుస్తులు విక్రయిస్తున్న దృశ్యం

మణుగూరుటౌన్: పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉండే ఓ ప్రముఖ బ్యాంకు ఏటీఎం పరిసరాలు సెలవు రోజుల్లో బట్టల దుకాణంలా.. పని దినాల్లో కూరగాయల వ్యాపారులకు అడ్డాగా మారుతోంది. సేవలో కోసం వస్తున్న వినియోగదారులకు ఆటంకంగా వాటి నిర్వహణ తయారైంది. బ్యాంకు పనిదినాల్లో సాయంత్రం వేళల్లో కొందరు చిరు వ్యాపారులు, రోజు కూలీలు ఏటీఎం సెంటర్ ఎదుట కూరగాయల వ్యాపారం నిర్వహించుకుంటున్నారు. రోజు కూలీల నుంచి కొందరు రోజూవారి మాముళ్లను వసూలు చేస్తున్నారు. మరోవైపు, వినియోగదారులు తమ వాహనాలకు పార్కింగ్ స్థలం లేక రోడ్డుపై నిలపడంతో, పోలీసులు ఫైన్లు విధిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు దృష్టి సారించి అడ్డగోలుగా బ్యాంకు సమీపంలో వ్యాపారాలు నిర్వహించే వారిపై, వారి నుంచి రోజు మామూళ్లు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని.. ఖాతాదారులకు పార్కింగ్ సదుపాయానికి మార్గం సుగమం చేయాలని ప్రజలు కోరుతున్నారు.